క్లుప్తంగా

బదిలీలకు దరఖాస్తుల సమర్పణ


దరఖాస్తులు పరిశీలనలో ఎంఈఓలు

నగరి: బదిలీల కోసం ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించుకున్నారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు రావడంతో కార్యాలయం కిటకిటలాడింది. ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 170 మంది బదిలీలకు దరఖాస్తులు సమర్పించుకున్నారని వారిలో 109 మంది ఉపాధ్యాయులు తప్పనిసరి బదిలీ కోరి ఉన్నారన్నారు.

గ్రామ దేవతకు పూజలు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో ఆదివారం గ్రామ దేవత లక్ష్మమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజుల్లో గంగమ్మ జాతర పురస్కరించుకుని గ్రామస్తులు గ్రామ దేవతకు పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. దీంతో గ్రామంలోని మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి గెరిగను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనాన్ని మరువొద్దు


శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: విద్యార్థులు తెలుగుభాష గొప్పతనాన్ని మర్చిపోకూడదని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత సూచించారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు తెలుగు గుణింతాలు, పద్యాలు నేర్పించడం, పుస్తక పఠనం, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగును మర్చిపోకూడదన్నారు. తెలుగుభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. పుస్తక పఠనం అలవాటు చేసుకుని మేధాశక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. అంతేగాకుండా వార్తా పత్రికలు, మ్యాగజైన్‌లు చదువుకొని రోజువారీ విషయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా పొన్నియమ్మ జాతర

గుడిపాల: మండలంలోని చుక్కావారిపల్లెలో ఘనంగా పొన్నియమ్మ జాతర నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అంబలి పోశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారిని ఊరేగించారు.

క్రికెట్ విజేతగా తిరువణంపల్లె జట్టు


విజేతగా నిలిచిన తిరువణంపల్లె టీమ్

ఐరాల: మండలంలోని చిగరపల్లె క్రీడా మైదానంలో నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీల్లో తిరువణంపల్లె జట్టు విజేతగా నిలిచింది. టైగర్ లెవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలకు సుమారు 20 జట్లు పాల్గొన్నాయి. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో పైపల్లె జట్టుపై తిరువణంపల్లె జట్టు విజయం సాధించి విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ.8 వేలు అందజేసినట్లు తెలిపారు.

2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో జూన్ 2వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతున్నాయని ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా బైపీసీ గ్రూపు అందుబాటులో ఉందన్నారు.

రమణీయం.. కల్యాణోత్సవం

బంగారుపాళెం: మండలంలోని కుమ్మరపల్లెలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకోదండరామచంద్ర ఆలయం వార్షికోత్సవంలో భాగంగా ఉదయం సీతారామ సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి వారి మూల విగ్రహాలకు ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు చేపట్టారు. రాత్రి సీతారాముల ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య సీతారాముల పరిణయాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్పపల్లకిపై స్వామి, అమ్మవారిని కొలువుదీర్చి, ఊరేగించారు.

మహిళామణి.. పోషక లేమి

- సమతుల ఆహారం తీసుకోని మహిళలు
- పౌష్టికాహారం వండుతున్నా.. తినడంలో మాత్రం వెనుకబాటు
- వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు
- ఎన్ఎస్ఐ పరిశీలనలో వెల్లడి



కార్వేటినగరం: ఇంటిల్లిపాదికీ మంచి ఆహారం వండిపెట్టే ఇల్లాలు.. తను మాత్రం పోషకాహారం తీసుకోవడంలో వెనుకబడిపోతోంది. భర్త, పిల్లలకు రుచికరమైన, బలమైన ఆహారం వండిపెట్టే ఆమె.. తాను తినడంలో కాస్త వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. ఎన్ఎస్ఐ(న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) ప్రతినిధులు జిల్లాలో చేసిన పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కేవలం 26 శాతం మహిళలే సరిపడా పౌష్టికాహారం తీసుకున్నట్లు తేలింది. ఏ రోజు ఏ వంట చేయాలో అంతా తన చేతిలోనే ఉన్నా తినేటప్పటికీ రకరకాల కారణాలతో శరీరానికి చేరాల్సిన సమతుల ఆహారం చేరడం లేదు. అందుకే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో పురుషుల కంటే ఎక్కువ మంది మహిళలే ఉన్నారని తేలింది. జిల్లాలో పౌష్టికాహారం తీసుకోక చాలా మంది మహిళలు రక్తహీనత బారిన పడుతున్నారు.

కూరగాయలు మాత్రం...

రోజూ కూరగాయలు తీసుకునే వాళ్లలో మహిళల సంఖ్య పురుషుల కంటే కాస్త ఎక్కువగా ఉంది. బీన్స్, చిక్కుళ్లు, క్యాబేజీ, క్యారెట్ తదితర కూరగాయలు రోజూ తీసుకునే మహిళలు 24.6 శాతం మంది ఉన్నారు. పురుషుల విషయానికి వస్తే 19.6 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. అదే చికెన్ లేదా మటన్ రోజూ తినేవారిలో పురుషులు 14 శాతం ఉండగా మహిళలు కేవలం 0.5 శాతం ఉన్నారు. వారానికోసారి మాంసం తినే మహిళలు 64.2 శాతం ఉండగా పురుషులు 71 శాతం ఉన్నట్లు తేలింది. కోడిగుడ్లు తినే విషయంలో మహిళలే కాస్త ముందంజలో ఉన్నారు. రోజూ గుడ్లు తినేవారిలో 5.4 శాతం మహిళలు, 3.5 శాతం పురుషులు ఉన్నారు. మొత్తం మీద రకరకాల పోషకాహారం తినేవారిలో పురుషులే ఎక్కువగా ఉన్నట్లు తేలింది.

వేధిస్తున్న రక్తహీనత

చిత్తూరు జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు 56 శాతం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అవగాహన లేక సమతుల ఆహారం తీసుకోలేక పోతున్నారు. రుతుక్రమం, గర్భం దాల్చడం తదితర కారణాలతో ఎక్కువ పోషకాహారం తీసుకోవాల్సి ఉన్నా గ్రామీణ ప్రాంత మహిళల్లో అంత అవగాహన లేదు. ఏ కూరగాయలో ఏముంటుంది, ఏ ఆకు కూరలు ఎప్పుడు తినాలి తదితర విషయాలు తెలియక రక్తహీనత బారిన పడుతున్నారు.

వివిధ ఆహార పదార్థాలు తీసుకునే వారి శాతమిలా...

ఆహారం	మహిళలు రోజువారీ	మహిళలు వారానికి	పురుషులు రోజువారీ	పురుషులు వారానికి
కూరగాయలు	24.6	68.9	19.6	74.3
ఆకు కూరలు	11.9	64.3	12.9	75.7
పండ్లు	9.3	37.8	8.2	53.1
గుడ్లు	5.4	68.4	3.5	76.4
చేపలు	1.5	38.5	1.5	48.8
చికెన్/మటన్	0.5	64.2	1.4	71.0
చికెన్/మటన్/ చేపలు	1.7	69.5	2.4	75.8
వేపుడు ఆహారం	3.9	29.4	2.5	36.1

సమతుల ఆహారం తీసుకోవాలి



ప్రస్తుత రోజుల్లో గర్భం దాల్చిన వారు తక్కువ బరువుతో ఉంటున్నారు. గర్భనిర్ధారణ అయ్యాక మొదటి మూడు నెలలు వాంతులతో తక్కువ ఆహారం తీసుకుంటారు. ఇటువంటి సమయంలో తక్కువ మోతాదులోనే పౌష్టికాహారం తీసుకోవాలి. ఆకుకూరలు, బఠానీ, చిక్కి, పాలు, పెరుగు, తక్కువ మోతాదులో నాన్‌వెజ్ తినాలి. గర్భధారణ సమయంలో 10 కేజీల వరకు బరువు పెరిగేలా ప్రణాళిక చేసుకోవాలి.

–డాక్టర్ భాగ్యలక్ష్మి, గైనకాలజిస్టు, కార్వేటినగరం సీహెచ్‌సీ

ఘనంగా అగ్ని గుండ ప్రవేశం

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర ఆదిఆంధ్రవాడలో మాతమ్మ తిరునాళ్ల ఘనంగా నిర్వహించారు. ఆదివారం అగ్ని గుండ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం గెరిగను గ్రామంలో గూరేగించి అగ్ని గుండం ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కంటి పరీక్షలకు 93 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు


చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడివీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులతో కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరానికి 161 మంది వచ్చారు. వీరికి పరీక్షలు చేయగా ఆపరేషన్‌కు 95 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామివర్మ సేవలు మరువలేనివి


గురువర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: ప్రపంచ దేశాలను వణికించిన కరోనా మహమ్మారి సమయంలో గురుస్వామివర్మ చేసిన సేవలు మండల ప్రజలు మరచిపోలేరని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం కార్వేటినగరంలో గురుస్వామి కర్మక్రియలకు హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి గురుస్వామివర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య ఉద్యోగిగా, వైఎస్ఆర్ సీపీ నాయకుడిగా గురుస్వామి వర్మ జగనన్న అడుగు జాడల్లో నడుస్తూ తన ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం సేవలు అందించారని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ ధనుంజయ వర్మ, ధనశేఖర్ యాదవ్, మండల పార్టీ కన్వీనర్ తులసియాదవ్(పాలసముద్రం), జడ్పీటీసీ సభ్యుడు అన్బుఅళగన్(పాలసముద్రం) మురళీకృష్ణారెడ్డి, ధనశేఖర్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో యంత్రాలతో పనులు



జేసీబీతో చేసిన పంట సంజీవి చేసి కుంట, కూలీలతో పని చేసినా బిల్లులు రాని పంట సంజీవి కుంట

- పట్టించుకోని ఉపాధిహామీ అధికారులు

పాలసముద్రం: మండలంలోని ఉపాధిహామీ పథకంలో పంట సంజీవి పనులను జేసీబీతో చేసి బిల్లులు చేసుకుంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ కూలీలతో చేపట్టిన పంట సంజీవి పనులకు మాత్రం బిల్లులు పెట్టడం లేదు. జేసీబీతో చేసిన పనులకు మాత్రం సక్రమంగా బిల్లులు పెడుతున్నారని పంట సంజీవి చేసుకున్న రైతులు వాపోతున్నారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో 154 పంట సంజీవి పనులు మంజూరయ్యాయి. అందులో 84 పంట సంజీవి పనులను ప్రారంభించారు. ఇందులో సుమారు 10 పంట సంజీవి కుంటలను జేసీబీతో పనులు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్‌కు అనుకూలంగా ఉన్న వారి పేర్లు మస్టర్‌లో నమోదు చేసి బిల్లులు పెట్టారు. గత సంవత్సరంలో బిల్లులు వచ్చేసిన పంట సంజీవి పనులను కూడా చూపి, కొత్తగా మస్టర్లు పెట్టి బిల్లులు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీల్డ్‌అసిస్టెంట్‌గా నియమితులైన వారంతా ఉపాధిహామీ పథకంలో పెత్తనం చలాయిస్తున్నారు. పనులు చేయని వారికి కూడా బిల్లులు వస్తున్నాయని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఇలా అంతు లేని అవినీతి జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో ఉపాధిహామీ పనులకు వెళ్లనివారు కూడా పోస్టాఫీసుకు వెళ్లి ఉపాధి హామీ బిల్లులు తీసుకుంటున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. ఏపీడీ కూడా ఫీల్డ్‌అసిస్టెంట్ చేతుల్లో కీలుబొమ్మగా మారి, అక్రమాలను పట్టించుకోవడం లేదని గుసగుసలాడుతున్నారు.

అలరించిన దుర్యోధన వధ


దుర్యోధన వధ ఘట్టం


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

కార్వేటినగరం: కత్తెరపల్లిలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి హరికథా కాలక్షేపాన్ని కనులకు కట్టినట్లు ఆలపించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర నాట్య కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగ మడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. దుర్యోధన పాత్రధారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. అమ్మవారికి మొక్కులున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆలయ ఆవరణలో పొంగళ్లు వండి, పిండి దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. యువత ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో అగ్ని గుండ ప్రవేశం

వార్షిక మహాభారత బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కంకణాలు ధరించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి, వేపాకులు చేతబట్టి అమ్మవారి విగ్రహంతో పాటు గోవిందనామాలను స్మరిస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకునే విధంగా ఆలయంతోపాటు గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

27 నుంచి మహా కుంభాభిషేకం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయ మహాకుంభాభిషేక పూజలను ఈనెల 27నుంచి 30వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. నాలుగు రోజులపాటు జీర్ణోద్ధారణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ పూజలు అత్యంత వైభవంగా ఉంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


అడ్వొకేట్ సంజీవిని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

పుత్తూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది ఎం.సంజీవి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో చట్టాలు–అవగాహన అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి సంజీవి మాట్లాడుతూ అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి, మానవ హక్కులను కాపాడుకోవడానికి చట్టాలు ఎంతో అవసరమని తెలిపారు. దోపిడీలు, హత్యలు, కిడ్నాప్‌లు తదితర నేరాలను నియంత్రించడానికి, సమాజ శాంతి కోసం చట్టాలు పని చేస్తాయని వివరించారు. అన్యాయం జరిగిందని భావించిన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని వివరించారు. అలాగే ఏడాదికి రూ.12 ప్రీమియంతో రూ.2 లక్షల వరకు బీమా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. దీనిని కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా అందిస్తోందని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సంజీవిని సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌మూర్తి, నాయకులు గోపికృష్ణ, మాధవులునాయుడు, మునికృష్ణయ్య, చిన్నా, బాషా, మురగేశురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అర్జున తపస్సు


హాజరైన భక్తులు


తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

గుడిపాల: మండలంలోని పిళ్లారికుప్పం గ్రామంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా సాగింది. ఆదిపరాశక్తి తమిళ నాట్య కళామండలి అర్జున వేషధారి తపస్మాన్ చెట్టులోని ప్రతి మెట్టుకూ పరమశివుడిని వేడుకుంటూ పద్యాలు ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించారు. సంతానం లేని మహిళలు తపస్సు మానువద్ద వరపడి సంతానం కలగాలని వేడుకున్నారు. అర్జునుడు తపస్మాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, వీబూది పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. తపస్సుమానుకు సంబంధించి ఉభయదారులు ఆరుముగం అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం నిర్వాహకుల ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

బండపల్లిలో ఆకట్టుకున్న దుర్యోధన వధ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాభారత యజ్ఞంను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని బండపల్లిలో సోమవారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత నాట్య మండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. ధర్మరాజుల ఆలయం ఆవరణలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను రూపొందించి పూజలు జరిపారు. దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుంచి బయటకు రప్పించే సన్నివేశం ఆకట్టుకుంది. దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధసన్నివేశాలు, పద్యాలు అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడిని తొడపై గదతో కొట్టి వధించి రక్తాన్ని ద్రౌపదిదేవి కురులకు పూసే సన్నివేశాల్లో పాత్రధారులు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. తర్వాత దుర్యోధనుడి మట్టి కోసం గ్రామస్తులు ఎగబడ్డారు. సాయంత్రం అగ్గి తొక్కే కార్యక్రమాన్ని చేపట్టి మహాభారత పర్వాన్ని ముగించారు.

భూసార పరీక్ష కేంద్రానికి మరమ్మతులు

చిత్తూరు రూరల్: మామిడికాయల మార్కెట్‌లోని భూసార పరీక్ష కేంద్ర మరమ్మతు పనులను అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ నెలాఖరుకు మరమ్మతు పనులు పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. వచ్చేనెల నుంచి కేంద్రంలో భూసార పరీక్షలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మట్టి నమూనా సేకరణ కూడా ఈ నెలాఖరుతో ముగియనుంది. దీంతో భూసార పరీక్ష ఫలితాలను రైతులకు త్వరితగతిన అందించాలనే ప్రయత్నంలో ఉన్నారు. మరమ్మతులకు ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

మద్యం ఏరులై పారుతోంది

- రాష్ట్రంలో పెచ్చుమీరుతున్న అరాచకాలు
- నా బిడ్డను మీ ఆడబిడ్డగా ఆదరించండి
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్రంలో కృపాలక్ష్మి

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం పుత్తూరులోని ఆయన నివాసంలో నియోజకవర్గం నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, ఏ గ్రామానికి వెళ్లినా పాలు దొరకడం లేదు కానీ మద్యం దొరుకుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టాక కూటమి నాయకులు, కార్యకర్తల అరాచకాలు, అక్రమాలు, భూదందాలు, ఇసుక, గ్రావెల్ మాఫియాలు యథేచ్ఛగా చెలరేగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణంగా ఉందన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేసి కొన్ని కోట్ల రూపాయలను పేదలకు పంచి పెట్టారని గుర్తు చేశారు. చంద్రబాబుకు పేదరికంతో అల్లాడుతున్న పేదలు అవసరం లేదరిచ అధికారం మాత్రమే ఆయన లక్ష్యమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడని చంద్రబాబుకు రానున్న రోజుల్లో ప్రజలు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, జగనన్న ధాటికి కూటమి కోట కుప్పకూలడం ఖాయమన్నారు.

నా బిడ్డను మీ ఆడ బిడ్డగా ఆదరించండి

తన బిడ్డ కృపాలక్ష్మిని మీ ఆడబిడ్డగా ఆదరించాలని నాయకులను కోరారు. తన అడుగు జాడలో నడిచిన కృపాలక్ష్మి ప్రతి కార్యకర్తకు అంకిత భావంతో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కక్షలు, కార్పణ్యాలను మరచి నియోజకవర్గంలోని ప్రజలంతా ఏకతాటిపై ఉంటూ తమ బిడ్డను ఆదరించి రాజకీయ భవిష్యత్తును అందించాలన్నారు. అనంతరం జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజల కోసం పోరాటం చేసేందుకు నేను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి(జీడీనెల్లూరు), గుణశేఖర్‌రెడ్డి, మునిరాజారెడ్డి, ఏకాంబరం, మండల పార్టీ కన్వీనర్(పెనుమూరు) విజయకుమార్‌రెడ్డి, నియోజకవర్గం మాజీ మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, దాము, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.